విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 09, నవంబర్ 2024

ఎన్పీసీఐ యాక్టివేషన్‌కు ప్రత్యేక శిబిరాలు

విశాలాంధ్ర-అనంతపురం : రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు ప్రతి సచివాలయం పరిధిలో ఐపిపిబి ఖాతాలు ఎన్పీసీఐ (ఎన్‌పిసిఐ) యాక్టివేషన్ కొరకు ఈనెల 15వ తేదీ వరకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు అనంతపురం పోస్టల్ సూపరింటెండెంట్ గుంపస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ రాష్ట్ర ప్రభుత్వ సామాజిక ప్రయోజనాలు పొందేందుకు బ్యాంకు తపాలాశాఖ ఖాతాలకు ఎన్పీసీఐ లింకు యాక్టివేషన్ చేయించుకోవాలన్నారు.

రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్‌కి సన్మానం

విశాలాంధ్ర-యాడికి: యాడికి తహసిల్దార్ కార్యాలయంలో రీ సర్వే డిప్యూటీ తహసిల్దారుగా విధులు నిర్వహిస్తున్న రాజ్‌కుమార్ గుంతకల్ డివిజన్ రెవిన్యూ అసోసియేషన్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నిక అయిన సందర్భంగా శుక్రవారం యాడికి తహసిల్దార్ ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్‌లు, వీఆర్ఏలు ఘనంగా సన్మానించారు. డిప్యూటీ తహసిల్దార్ శ్రీనివాసులు ఆర్ఐ క్రిష్టప్ప వీఆర్వోలు రమేష్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల వైద్యానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి

కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

విశాలాంధ్ర-అనంతపురం: పేద ప్రజలకు వైద్య సేవలు అందించేలా వైద్యులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి పిలుపునిచ్చారు. శుక్రవారం అనంతపురం ప్రభుత్వ మెడికల్ కళాశాల వద్దనున్న ఐఎంఏ హాల్‌లో ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ పెడికాన్ 2024 వర్క్‌షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం ఐఎంఏ ఆఫీస్ బేరర్స్ అంకితభావం పట్టుదల తనకెంతో నచ్చిందన్నారు. ఇటీవల ప్రైవేట్ మెడికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం కింద ఒక కమిటీని ఏర్పాటు చేశామన్నారు. గత 12 ఏళ్లుగా ఇది కార్యరూపం దాల్చకపోవడం తనను ఒకింత ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. ఈ చట్టం కింద డాక్టర్లను తీసుకున్నామని, వారు నిర్ణయాత్మకమైన అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలియజేయవచ్చన్నారు. స్వతహాగా తాను డాక్టర్‌ని అని, బెంగళూరు మెడికల్ కాలేజీలో వైద్యపట్టాను పొందానన్నారు. వైద్య వృత్తి నా మొదటి ఇల్లుగా భావిస్తానని, అందులోకి మిమ్మల్ని ఆహ్వానిస్తున్నానన్నారు. నేను ఏ స్థాయిలో ఉన్నప్పటికీ వైద్య సేవలు అందించడమే నా తొలి ప్రాధాన్యతగా భావిస్తానన్నారు. సివిల్ సర్వీస్ పరీక్షల్లో నా తొలి ప్రయత్నంలోనే అత్యధిక స్కోరు సాధించడానికి మెడికల్ సైన్స్ ఎంతో దోహదపడిందన్నారు. వైద్యులంతా ఈ వృత్తిని ఒక బాధ్యతగా తీసుకొని సేవలందించాల్సి ఉంటుందన్నారు. ఇలాంటి సెమినార్లు వైద్యులకు ఎంత ఉపయోగపడుతుందన్నారు. ఇలాంటి సాంకేతిక సమావేశాలు రాష్ట్రవ్యాప్తంగా జరగడం ఎంతో శుభసూచకమన్నారు. జిల్లాలోని ఏ మారుమూల ప్రాంతంలోనైనా ప్రజలకు వైద్య సేవలు అందించేలా డాక్టర్లు కృషి చేయాలన్నారు. ఈ వర్క్‌షాప్‌లో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.కేఎస్ఎస్. వెంకటేశ్వర రావు, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డా.అనిల్‌కుమార్, స్టేట్ సెక్రటరీ డా.ఏఎస్.కిరీటి, జీజీహెచ్ పీడియాట్రిక్ హెచ్వోడి డా.ఎం.రవి కుమార్, ఆర్గనైజింగ్ చైర్పర్సన్ పి.శ్రీకాంత్‌రెడ్డి, బెంగళూరు మదర్ హుడ్ హస్పిటల్ న్యూయోనెటల్ డాక్టర్ ప్రతాప్ చంద్ర, ఆర్గనైజింగ్ సెక్రెటరీ డా.డి.పవన్ కుమార్, డిసిహెచ్ఎస్ డా.పాల్ రవికుమార్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా.మాణిక్యరావు, అడిషనల్ డీఎం హెచ్వో సుజాత, డాక్టర్లు, సీనియర్ నర్సులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే అందజేయండి

సిపిఐ పట్టణ కార్యదర్శి కొట్రేష్

విశాలాంధ్ర-రాయదుర్గం అర్బన్ : నియోజక వర్గ వ్యాప్తంగా పెండింగులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే రైతులకు అందించాలని సిపిఐ పట్టణ కార్యదర్శి కొట్రేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని విద్యుత్ కార్యాలయం ఎదుట సిపిఐ నాయకులతో కలిసి ధర్నా చేపట్టి ఏఈ బాలచంద్రకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుమ్మగట్ట, కనేకల్, బొమ్మనహాల్, హీరేహాల్ మండలాలకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్లను రైతులకు వెంటనే అందించడంలో విద్యుత్‌శాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. తాలూకా వ్యాప్తంగా ఉన్న రైతులు బోర్లు వేసుకొని డ్రిప్ పైపులు, విత్తనాలు, కొనుగోలు చేసి ట్రాన్సుఫార్మర్లు వస్తే సాగు చేయ దానికి సిద్ధంగా ఉన్నారన్నారు. రైతులకు డీపీలు రాకపోవ డంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. డీపీలు రాకపోవడంతో కొందరు కాంట్రాక్టర్ల చేతిలో రైతులు విలవిల లాడుతున్నారని తెలిపారు. రాయదుర్గం మండలానికి చెందిన కొండాపురంలో లక్ష్మి తిప్పేస్వామిలు డీడీలు చెల్లించి సంవత్సరాలు అవుతున్న వారికి ట్రాన్సుఫార్మర్లు ఇవ్వకపోవ డంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే విద్యుత్ శాఖ అధికారులు డీపీలు మంజూరు చేయకుంటే తాలూకా వ్యాప్తంగా విద్యుత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సీపీఐ మండల కార్యదర్శి దుర్గన్న, ఏపీ రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు నర్సింలు, వ్యవసాయ కార్మిక సంఘం తాలూకా అధ్యక్షుడు నాగరాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, ఏఐవైఎఫ్ తాలూకా అధ్యక్షుడు కుమార్ తేజ, సిపిఐ నాయకులు చౌడప్ప, రైతులు తిప్పేస్వామి, లక్ష్మణ్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రి విగ్రహం ఏర్పాటు

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం : అనంత పురం నగరంలో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చొరవతో.. దేశ తొలి విద్యాశాఖ మంత్రి స్వాతంత్ర సమరయోధులు, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దేశానికి ఎన్నో సేవలు అందించిన అబుల్ కలాం ఆజాద్‌ను స్మరించు కుంటూ గతంలో టవర్ క్లాక్ వద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో జరిగిన రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఆ విగ్రహాన్ని అక్కడ తొలగించారు. ఆ తర్వాత విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని జిల్లాలోని కొందరు మైనార్టీ నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అప్పటి నాయకుల్ని కోరినా ఏమాత్రం పట్టించుకోలేదు. ఎమ్మెల్యే గా దగ్గుపాటి గెలిచిన తర్వాత కొందరు మైనార్టీ నాయకులు ఆయన దృష్టికి ఈ విషయాన్ని తీసుకొచ్చారు. దీనిపై వెంటనే స్పందించి టవర్ క్లాక్ వద్ద ఆయన విగ్రహం ఉండేలా చొరవ తీసుకున్నారు. ఇప్పటికే సిమెంట్ దిమ్మె ఏర్పాటు చేసి.. విగ్రహాన్ని పునః ప్రతిష్టకు సిద్ధం చేశారు. ఈనెల 11వ తేదిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి రోజు విగ్రహ పునఃప్రతిష్టాపన చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తాము విజ్ఞప్తి చేసిన వెంటనే ఎమ్మెల్యే స్పందించి.. విగ్రహం ఏర్పాటు చేయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయుడు పాడెమోసిన ఎంఈఓ

విశాలాంధ్ర-శెట్టూరు : మండలంలోని ములకలేడుకు చెందిన ఉపాధ్యాయుడు నరసింహులు(38) అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎంఈఓ శ్రీధర్, ఉపాధ్యాయుల బృందంతో కలిసి ములకలేడు గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూల మాలేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయుడు పాడేమూసి అంత్యక్రియలు పాల్గొన్నాడు. ఎమ్మెస్ రాయుడు, ఉపాధ్యాయులు రాజన్న, తిప్పేస్వామి, చిరంజీవి, వెంకటేశు, మహేష్, మారుతి గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం..

విశాలాంధ్ర-రాప్తాడు: మండలంలో ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు వేగవంతం చేస్తున్నామని ఎంపీడీఓ వి.విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని మరూరు పంచాయతీలో శుక్రవారం గోకులం షెడ్ల పురోగతిని, రూ.20లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్లను, పరిశీలించారు. గ్రామ సచివాలయాన్ని సందర్శించి హాజరు పట్టికను పరిశీలించి ఉద్యోగులు సమయపాలన పాటించాలన్నారు. అదేవిధంగా రాప్తాడు మైనారిటీ కాలనీలో వేస్తున్న మురుగుకాలువల నిర్మాణాలను పరిశీలించారు. నాణ్యతలో రాజీ లేకుండా నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శైలజ, రమణారెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సరస్వతి, కళ్యాణ్, నాయకులు వడ్లమూడి కేశవ, వెంకట్రాముడు, మేనక, పాల్గొన్నారు.

విధులకు గైర్హాజరైతే క్రమశిక్షణ చర్యలు

విశాలాంధ్ర-రాప్తాడు: ఎన్నికల ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్ర మానికి సూపర్‌వైజర్లు బీఎల్‌ఓలు గైర్హాజరైతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని తహశీల్దార్, సహాయ ఓటరు నమోదు అధి కారి పి.విజయకుమారి, హెచ్చరించారు. రాప్తాడు తహశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ ఎన్నికల సిబ్బందితో శుక్రవారం సాయంత్రం సమావేశమయ్యారు.నేడు, రేపు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రంలో ప్రతి ఒక్క బీఎల్‌ఓ విధులకు ఖచ్చితంగా హాజరు కావాలన్నారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఈడీటీ సువర్ణ, డీటీ చెన్నకేశవులు, ఆర్ఐ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు

గర్భిణులకు వైద్య పరీక్షలు..

విశాలాంధ్ర-యాడికి: రాయలచెరువు గ్రామంలో నీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పిఎంఎస్ ఎంఎ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వైద్యాధికారి అప్పయ్య ఆధ్వర్యంలో 20 గ్రామాల గర్భవతులకు గాను 35మందికి బిపి, ఎహెచ్‌బి బరువు, గర్భస్థ పిండం కదలికల వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. 8 మంది గర్భిణులను ఉచిత స్కానింగ్‌కు ఎంపిక చేశారు

జాతీయ స్థాయి హాకీ జట్టుకు సనప విద్యార్థి

విశాలాంధ్ర-ఆత్మకూరు: ఈనెల 3,4,5 తేదీలలో నెల్లూరులో జరిగిన రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో అనంతపురం జిల్లా బాలికలు అత్యంత ప్రతిభ కనబరిచి రన్నర్స్ గా నిలవడం విశేషం. ఈనెల 17 నుంచి హర్యానా రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి జట్టులో చోటు సంపాదించిన సనప విద్యార్థిని సంధ్య జాతీయ స్థాయి పోటీలకు సెలెక్ట్ అయ్యింది. సంధ్య సనప హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతోంది. హెచ్ఎం సుధా, పిడిగట్టు నాగరాజు, ఉపాధ్యాయ బృందం, నాన్ టీచింగ్ స్టాఫ్ అభినందించారు.

అంగన్వాడీ వర్కర్స్ బాగా పనిచేయాలి

విశాలాంధ్ర-గుత్తి: పట్టణం ఐసిడిఎస్ కార్యాలయంలో శుక్రవారం ఐసిడిఎస్ సిడిపిఓ ఢిల్లీశ్వరి ఆధ్వర్యంలో గుత్తి, పామిడి మండలంలోని 135 మంది అంగన్వాడీ హెల్పర్స్‌తో సమావేశం నిర్వహించారు. సిడిపిఓ మాట్లాడుతూ అంగన్వాడి పిల్లలను హెల్పర్స్ వారి ఇంటి నుంచి సెంటర్‌కు పిలుచుకొని రావడం పాఠశాల అనంతరం వారి ఇంటికి చేర్చడం బాధ్యత అని, ఏవైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సమయపాలన పాటించాలన్నారు. గుత్తి సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.నాగేశ్వరి, పాల్గొన్నారు.

JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY ANANTAPUR ANANTHAPURAMU
-515 002 (A.P.) INDIA

TENDER NOTICE

NIT No. 01/JNTUA Wall Calendars, Desktop Planners and Telephone Directory for the year 2025, Date: 07-11-2024

Tenders are invited from reputed firms for the Designing, Printing & Supply of JNTUA Wall Calendars, Desktop Planners and Telephone Directory for the year 2025. For details visit the AP e-procurement portal ***https://tender.apeprocurement.gov.in*** with Tender ID: 764074.

Sd/- REGISTRAR

ఏ.ఆర్ సిబ్బంది ఫిట్‌నెస్ కలిగిఉండాలి : ఎస్పీ జగదీష్

విశాలాంధ్ర-అనంతపురం: జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో శుక్రవారం ఎస్పీ పి.జగదీష్ అనంత పురం రూరల్ సబ్ డివిజనన్ల సిబ్బంది, ఏ.ఆర్ సాయుధ బలగాల పరేడ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఫిజికల్ ఫిట్నెస్ కల్గి ఉండాలన్నారు. చక్కగా యూనిఫాం ధరించి ప్రజలతో మంచి సంబంధాలు కల్గి ఉండాలి అని పేర్కొన్నారు. అందరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచన చేశారు. ఆరోగ్యం మెరుగదల మరియు ఫిజికల్ ఫిట్నెస్ కోసం ప్రతీరోజూ గ్రౌండు, ప్రాక్టీస్ వదలకూడదన్నారు. మీ ఆరోగ్యం బాగుంటునే మీ కుటుంబం కూడా బాగుంటుందని గుర్తుంచుకోవాలన్నారు. ఆరోగ్యంతో పాటు మానసికంగా దృఢంగా ఉంటేనే విధుల్లో సమర్థవంతంగా పని చేయడానికి అవకాశం ఉందన్నారు. వారి విధుల్లో మరియు ఆరోగ్య, విద్య, తదితర అంశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారం చేసే దిశగా చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. సిబ్బంది నుండీ గ్రీవెన్స్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, డీఎస్పీలు వి.శ్రీనివాసరావు, టి.వెంకటేశ్వర్లు, ఎస్ మహబూబ్ బాషా, పలువురు సి.ఐలు, ఆర్ఐ, ఎస్సైలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్ల తనిఖీ

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం అర్బన్, రూరల్ సర్కిల్, రూరల్ యు.పి.ఎస్ పోలీసు స్టేషన్‌లను శుక్రవారం ఎస్పీ జగదీష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్లలోని లాకప్, రిసెప్షన్, జి.డి మరియు రికార్డుల నిర్వహణను తనిఖీ చేశారు. క్రైం చార్జును పరిశీలించి ఎలాంటి నేరాలు నమోదవుతున్నాయని, వాటి నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో అడిగి తెలుసుకున్నారు. సమస్యాత్మక గ్రామాలలో శాంతిభద్రతల గురించి చర్చించారు. సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన ముఖ్యమైన కేసులు, పాత గ్రేవ్, ఎక్సైజ్ కేసులను సమీక్షించారు.

విద్యార్థుల విజయానికి స్వీయ-క్రమశిక్షణ మూలస్తంభాలు

వీసీ ఆచార్య సుదర్శన్ రావు

విశాలాంధ్ర-జేఎన్టీయూఏ : విద్యార్థుల విజయానికి స్వీయ-క్రమశిక్షణ మూలస్తంభాలు అని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ ఆచార్య హెచ్ సుదర్శన్ రావు పేర్కొన్నారు. శుక్రవారం మదనపల్లి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో ఫ్రెషర్స్ డే2024 వేడుకలను వీసీ, కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ విజయభాస్కర్ చౌదరి, ప్రెసిడెంట్ ఆర్ఆర్ఆర్ ఎడ్యుకేషనల్ అకాడమీ ఎన్ ద్వారకానాథ్, ప్రిన్సిపల్ సి యువరాజ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. ఏకాగ్రతతో సవాళ్లను అధిగమిం చడం, సమర్థతను పెంపొందించుకుని లక్ష్యాలపై ప్రణాళిక కార్యాచరణ అమలతో విజయాలను అందిపుచ్చుకోవాలని అన్నారు. పాఠ్యాంశాలపై అవగాహన, పరిశోధన, అధ్యయనం, విభిన్న సబ్జెక్టులపై పట్టు, సాంకేతికతపై నిరంతర అన్వేషణ చేపట్టాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల కరస్పాండెంట్ ఎన్ విజయభాస్కర్ చౌదరి మాట్లాడుతూ.. గ్రాడ్యుయేషన్‌తో ప్రమాణాలు మెరుగు, భవిష్యత్తును నిర్దేశించుకుని ఉజ్వల ప్రయాణానికి నాంది అవుతూ సమయాన్ని నిరంతర సాధనతో కలల స్వప్న నిజం చేసుకోవాలని కోరారు. పారిశ్రామిక రంగంలో విభిన్న అవకాశాలను అందిపుచ్చుకునేలా ఆలోచనలో వినూత్నం, పారిశ్రామిక వ్యక్తులుగా ఎదిగేందుకు ఇంజనీరింగ్‌లో సదవకాశాన్ని కల్పిస్తుందన్నారు. కోర్సు చదువుతూ ఇంటెర్‌షిప్ ఆఫర్ వినియోగించుకుని.. సరికొత్తగా అధ్యయనం, ఉపాధి కల్పన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

విశాలాంధ్ర-తాడిపత్రి: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్య పరిరక్షణ అని మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ ఆధ్వర్యంలో చిరు వ్యాపారస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ జేసి ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరు వ్యాపారస్తులు తాము వ్యాపారం చేసే పరిసరాల చుట్టూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తమ వద్ద ఉన్న చెత్తను మున్సిపల్ వాహనాలు వచ్చినప్పుడు ఆ చెత్తను వాహనాలలో వేయాలన్నారు. చెత్త రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దడానికి తోడ్పాటు అందించాలని కోరారు.

వైభవంగా అమ్మవారి విగ్రహాల ప్రతిష్ట

విశాలాంధ్ర-బొమ్మనహాళ్ : సింగేపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయాల్లో శుక్రవారం సుంకులమ్మ, మారెమ్మ దేవతల విగ్రహ ప్రతిష్ట వైభవంగా చేశారు. రామకృష్ణ స్వామి వేద పండితుల ఆధ్వర్యంలో యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, బలి, చండీ హెూమములు చేపట్టారు. రెండు రోజుల నుండి నూతన ఆలయాల్లో విశేష పూజలు చేపట్టారు. ప్రతి ఇంటి నుండి ఒడిబియ్యం సమర్పించారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు అమ్మవారి ఆలయాలను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ అండర్‌లో అనంత విద్యార్థులు విజయభేరి

విశాలాంధ్ర-జేఎన్టీయూ ఏ: ఉంగుటూరు క్రైకరం జడ్పీ హైస్కూల్ లో ఈనెల 6 నుండి 7 వరకు జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ అండర్ 14 బాయ్స్ అండ్ గర్ల్స్ సెలక్షన్స్‌లో అనంతపురం అత్తిలిటిక్స్ టీం ఓవరాల్ ఛాంపియన్షిప్ సెకండ్ ప్లేస్ సాధించింది విజయభేరిని మోగించి అనంత కీర్తిని ఇనుమడింపజేశారు. శుక్రవారం పోటీలలో గెలుపొందిన విద్యార్థులను డిఈఓ ప్రసాద్ బాబు, ఏడి నాగరాజు అభినందించారు. వర్షిత జడ్పీ హైస్కూల్ నరసాపురం అమ్మాయి వ్యక్తిగత విభాగంలో ఛాంపియన్షిప్ సాధించింది వర్షిత 400 మీటర్లు , 600 మీటర్లు పరుగు పందెంలో గోల్డ్ మెడల్ 4ల100 రిలే పరుగు పందెంలో అనంతపూర్ టీం బాలికల టీం(1. సుప్రియ కేజీబీవీ అమలాపురం,స్ఫూర్తి జడ్.పి.హెచ్.ఎస్ సిరివరంథర్డ్ ప్లేస్ లిఖితారెడ్డి జెడ్పిహెచ్ఎస్ తలుపురీరు వర్షిత జడ్.పి.హెచ్.ఎస్ నరసాపురం) బాయ్స్‌లో మౌలాలి సెయింట్ విన్సెంట్ డిపో అనంతపురం 400 మీటర్స్ గోల్డ్ 600 మీటర్స్ సిల్వర్ మెడల్ సాధించాడు. వాయిస్ 4ల100 రిలే పరుగు పందెంలో అనంతపూర్ టీం సెకండ్ ప్లేస్ సాధించింది టీంలో పాల్గొన్నవారు(టి దిలీప్ ఎంజెపి లేపాక్షి సాయి కిరణ్ సెయింట్ మేరీ గుత్తి రవితేజ ఎంజెపి లేపాక్షి నవీన్ కుమార్ ఏపీ ఆర్ ఎస్ నూతిమడుగు పాల్గొన్నారు. అథ్లెటిక్స్ అండర్ 14 బాయ్స్ అండ్ గర్ల్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో అనంతపురం బాల బాలికల జట్టు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌గా నిలిచారు. స్కూల్ గేమ్ సెక్రటరీ సుగుణమ్మ, వ్యాయామ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు వేణుగోపాల్, ప్రసాద్ పిడి, చెల్ల ఓబులేసు అథ్లెటిక్ కోచ్ చలపతి అభినందించారు.

రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కాలువ భూమిపూజ

విశాలాంధ్ర-కణేకల్లు: కనేకల్లు..రోడ్డు కలేకుర్తి క్రాస్ నుండి కలెకుర్తి గ్రామం వరకు 1 కోటి 8 లక్షలతో ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు చేతుల మీదుగా శుక్రవారం రోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఎటుచూసినా రహదారుల గుంతల మాయం తో ప్రజలు నానా అవస్థలు పడేవారని, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వేల కోట్ల రూపాయలను పెట్టి రాష్ట్ర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్డు నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ ఆనంద రాజులు, కన్వీనర్ లాలెప్ప, సుదర్శన్, శరబన్న గౌడ, హనుమాపురం సర్పంచ్ జయరామ చౌదరి, ఎంపీటీసీ నరేంద్ర బాబు, వన్నారెడ్డి పాల్గొన్నారు

సీఎం సహాయ నిధి పేదలకు వరం

విశాలాంధ్ర-నార్పల : సీఎం సహాయ నిధి పథకం పేదలకు వరమని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ అన్నారు. నియోజకవర్గం పరిధిలోని పలువురు లబ్ధిదారులకు రూ. 634089 చెక్కులను శుక్రవారం అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్ని ఇబ్బందులు ఉన్న, పేదలను ఆదుకుం టున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ..

విశాలాంధ్ర పామిడి : మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి నవంబర్ 9వ 10వ 23వ 24వ తేదీన ఓటర్ల జాబితా పరిశీలన కొనసాగనుంది. ఓటరు గుర్తింపు కార్డుల్లో సరైన సమాచారాన్ని చేర్చడం, తొలగించడం, ఎలక్టోరల్ రోల్స్‌లో అడ్రస్ మార్పు, తొలగింపు చేయాలనుకునే ఓటర్లు ఈ ప్రత్యేక కార్యక్రమంలో చేయించుకోవచ్చని శుక్రవారం పత్రికా ప్రకటనలో తాహసిల్దార్ శ్రీధర్ మూర్తి తెలిపారు. బూత్ స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాల్లో వెరిఫికేషన్ చేస్తారని, ఏవైనా సమస్యలు ఉంటే అధికారులను సంప్రదించాలని సూచించారు.

10 నుంచి జీ తెలుగు సింగింగ్ షో సరిగమప సీజన్ 16

విశాలాంధ్ర/ అనంతపురం : తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న మ్యూజికల్ రియాలిటీ షో సరిగమప సీజన్ 16 నవంబర్ 10 నుండి ప్రతి ఆదివారం రాత్రి 8:30 గంటల నుంచి 10 గంటల వరకు జీ తెలుగులో ప్రసారం కానుందనీ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు.ఎనర్జిటిక్ యాంకర్ శ్రీముఖి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న ఈ సీజనుకు సంగీత దిగ్గజాలు కోటి, ఎస్పీ శైలజ, కాసర్ల శ్యామ్తో ఈ సీజన్ ఉత్తేజకరమైన ప్రదర్శనలు, మనసును హత్తుకునే పాటలతో సంగీత ప్రియులకు మరింత వినోదం పంచబోతోందన్నారు. ప్రతి కంటెస్టెంట్ తమ ఆకట్టుకునే ప్రదర్శనలతో తెలుగు ప్రేక్షకులకు ఫేవరెట్గా మారుతున్నారన్నారు. ఔత్సాహిక గాయకులు తదుపరి సింగింగ్ సెన్సేషన్ టైటిల్ కోసం పోటీ పడుతుండటంతో థ్రిల్లింగ్ కాంపిటీషన్లు, మరచిపోలేని క్షణాలను అందిస్తూ ప్రతి వీకెండ్ని మరింత స్పెషల్ చేస్తోందన్నారు.

ఆదివారం అంతులేని వినోదం అందించే ఉద్దేశంతో జీ తెలుగు సరిగమప సీజన్ 16 ప్రసార సమయాన్ని మరింత పెంచిందన్నారు. శ్రోతల మనసును తాకే సంగీతంతోపాటు చక్కని వినోదం అందించే లక్ష్యంతో వస్తున్న జీ తెలుగు సరిగమప సీజన్ 16 ప్రతి ఆదివారం రాత్రి 8:30 గంటలకు, తప్పక చూడలన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

- ఎస్‌టియు నాయకులు

విశాలాంధ్ర-జెఎన్టియుఏ: ఉద్యోగ ఉపాధ్యాయుల ఆశలకు, ఆకాంక్షలకు అనుగుణంగా ఏర్పడిన నూతన కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి, అలసత్వం లేకుండా 12వ పిఆర్సీకి సంబంధించిన మధ్యంతర భృతిని ప్రకటించాలని ఎస్.టి.యు జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం బ్రహ్మసముద్రం మండలం సమస్యల సేకరణ- సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కోనాపురం, సూగేపల్లి, పాల వెంకటాపురం, బ్రహ్మ సముద్రం, ఎర్రడికేర, వెస్ట్ కోడిపల్లె, బొబ్బర్లపల్లి ఎర్రప్పదండి, మాముదూరు పాఠశాలలో సభ్యత్వ నమోదును చేపట్టారు. అనంతరం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఉద్యోగ ఉపాధ్యాయుల ఆకాంక్షలకు అనుగుణంగా 12వ పిఆర్సీలో భాగంగా మధ్యంతర భృతిని ప్రకటించి గత పిఆర్సీకి బకాయిలను, పెండింగ్‌లో ఉన్న డిఏ బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, ఏపీ జిఎల్ఐ ఫైనల్ పేమెంట్లు, మెచ్యూర్ అయిన బాండ్ల పేమెంట్లు చెల్లించాలని కోరారు. పురపాలక ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు, జి.పి.ఎఫ్ సౌకర్యం కల్పించాలని అనంతపురం జిల్లాలో ఆగిపోయిన ఇంగ్లీష్ పదోన్నతులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్రహ్మసముద్రం మండలం ఎస్టీయు వై.చంద్రశేఖర్ సీనియర్ నాయకులు ఆనంద్‌రెడ్డి, కృష్ణమూర్తి, మల్లికార్జున గౌడ్, సిపిఎస్ కళ్యాణ్ దుర్గం డివిజనల్ కన్వీనర్ కె.తిప్పేస్వామి పాల్గొన్నారు.

కిడ్నీ ఇన్ఫెక్షన్ బాధితుడికి చేయూత..

విశాలాంధ-శెట్టూరు: కిడ్నీ ఇన్ఫెక్షన్ బాధితుడికి ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దే నాయక్ ఆర్థిక చేయూత అందించారు. కుందుర్పి మండలం జంబుగుంపల గ్రామానికి చెందిన దుర్గన్న(42) కిడ్నీ ఇన్ఫెక్షన్‌తో బాధ పడుతున్నారు. దుర్గన్నది నిరుపేద కుటుంబం భార్య, ముగ్గురు పిల్లలు. వీరు రోజువారి కూలీలు. కుటుంబ పెద్ద దుర్గన్న అనారోగ్యం పాలై ఆసుపత్రులు తిరిగి ఉన్న డబ్బంతా ఖర్చు పెట్టుకొని చివరగా డాక్టర్ల సూచన మేరకు బెంగళూరులోని సెయింట్ జాన్ ఆసుపత్రిలో 12 రోజుల నుండి చికిత్స పొందుతున్నారు మందులకు రోజుకు రూ.10వేల వరకు ఖర్చు అవుతోంది. గ్రామ యువకుల సలహాతో ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు బద్దేనాయక్‌ను సంప్రదించగా మాకొడికి పాఠశాలలో విరామ సమయంలో దుర్గన్న సోదరుడు చౌడప్పకు రూ.15 వేల నగదును అందించి తన ఉదార స్వభావాన్ని చాటుకున్నారు ఈ మేరకు చౌడప్ప కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా పప్పూరు.రామాచార్యులు 128వ జయంతి..

విశాలాంధ్ర-అనంతపురం రూరల్: స్వతంత్ర సమరయోధులు శ్రీ బాగ్ బడంబడికలో రాయలసీమకు ప్రాతినిధ్యం వహించిన ప్రముఖులలో ఒకరు పప్పూరు రామాచార్యుల 128వ జయంతిని అనంతపురం సాహిత్య మిత్ర బృందం ఆధ్వర్యంలో స్థానిక విశాలాంధ్ర బుక్ హౌస్‌లో శుక్రవారం పప్పు రామాచార్యుల చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు వెలుగు సాహిత్య, సామాజిక సేవా సంస్థ అధ్యక్షులు టివి రెడ్డి మాట్లాడుతూ..పప్పురు.రామాచార్యులు రాయలసీమ ఉద్దండులలో ఒకరు, ఆయన రచనలు , సంపాదకీయాలు రాయలసీమ వెనుకబాటుతనానికి అద్దం పడుతూ యువతలో చైతన్య నింపడానికి 15 రోజులకు ఒకమారు వ్యాసాలు ప్రచురించేవారు. ఆయన అనంతపురానికి ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. జిల్లా జాషువా పీఠం ప్రధాన కార్యదర్శి హెచ్. నాగలింగయ్య , అనంత సాహితీ ప్రస్థానం వ్యవస్థాపకులు గంగిరెడ్డి అశ్వర్థరెడ్డి, విశాలాంధ్ర బుక్ హౌస్ నిర్వాహకులు చెట్ల ప్రవీణ్ మాట్లాడుతూ... 1926 సాధన పత్రిక స్థాపించి ప్రచురించారు ఆయన సమకాలీన సమాజ పరిస్థితులు సాంఘిక దురాచారాలపై జాతీయ ఉద్యమం మొదలైన అంశాలపై హాస్య వ్యంగాత్మక ధోరణిలో 50 పైగా వ్యాసాలు వెలువరించారు. అనంతపురంలో గ్రంథాలు గ్రంథాలయం స్థాపనకు ఎనలేని కృషి చేసిన త్యాగశీలి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షులు కె.సుబ్బరాయుడు, విజయ భాస్కర్‌రెడ్డి విశాలాంధ్ర నిర్వాహకులు శ్రీనివాసులు, హరీష్, తిమ్మప్ప, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 09, నవంబర్ 2024

రీఓపెన్ గ్రీవెన్స్‌పై ప్రత్యేక దృష్టి సారించండి : కలెక్టర్

విశాలాంధ్ర-ధర్మవరం: రీ ఓపెన్ గ్రీవెన్స్‌పై ప్రత్యేక దృష్టి ఉంచి చట్ట పరిధిలో సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ధర్మవరం డివిజన్ రెవెన్యూ కార్యాలయంలోని సమావేశం మందిరంలో పలు రెవెన్యూ అంశాలపై, సాగు నీటి సంఘాల ఎన్నికలపై, ఓటర్ల జాబితా సవరణపై, కోర్టు కేసులు, ఈ ఆఫీస్, గ్రామ సభలు, పలు అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా, సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ధర్మవరం డివిజన్ అధికారి మహేష్, డివిజన్ పరిధిలోని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేర్లు, ఎమ్మార్వోలు, సర్వేయర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలల్లో స్వీకరించిన దరఖాస్తులు పురోగతి చూపాలన్నారు. ముఖ్య మంత్రి కార్యాలయం నుంచి, ఉప ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి, స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన వినతలు సకాలంలో పరిష్కరించాలన్నారు. ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఎండార్స్మెంట్ స్పీకింగ్ ఆర్డర్ కచ్చితంగా దరఖాస్తుదారు లకు అందజేయాలి అని తెలిపారు. జిల్లాలో 46 వినియోగ సంఘాలకు సంబంధించి ఓటర్ల జాబితా తయారీ, పోలీస్ స్టేషన్ గుర్తింపు, ప్రచురణ సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన షేక్షా వలీ

విశాలాంధ్ర-రొళ్ల: స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో సి.ఎస్ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న షేక్షావలి శుక్రవారం ఇంచార్జ్ తహసిల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మండలంలో ప్రజలకు అందు బాటులో ఉంటూ ముఖ్యంగా రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు వన్ బి విద్యార్థులకు క్యాస్ట్ ఇన్ కమ్ సర్టిఫికెట్స్ తదితర రెవిన్యూ సంబంధిత సమస్యలను ప్రజలకు అందు బాటులో ఉంటూ పరిష్కరిస్తానని తెలిపారు. ఇక్కడ ఇంచార్జ్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న భాగ్యలక్ష్మి అగళి మండలం సి.ఎస్.డి.టిగా బదిలీపై వెళ్లారు.

రెవెన్యూ సదస్సుల ద్వారా సత్వరమే భూ సమస్యల పరిష్కారం

- మంత్రి సవితమ్మ

విశాలాంధ్ర-పెనుకొండ : ప్రజల సమక్షంలోనే భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్న దని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సవితమ్మ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని మునిమడుగు గ్రామంలో రెవెన్యూ సదస్సులో మంత్రి ప్రజల అర్జీలను స్వీకరించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశిం చారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు గ్రామపం చాయతీలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రెవెన్యూ శాఖలో ఆన్లైన్ ట్యాంపరింగ్, రికార్డులు తారుమారుపై అధికారులు గ్రామ స్థాయిలో ఫిర్యాదుల స్వీకరించి పరిష్కరిస్తారన్నారు. వై.సి.పి ప్రభుత్వ పాలనలో రెవెన్యూ పరంగా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, భూ రక్షా పథకం వలన రైతులు చాలా ఇబ్బందులు పడ్డారని, జిల్లాలో రాష్ట్రస్థాయిలోనే భూ సమస్యలపై ఎక్కువ అవినీతి జరిగిందని వాటిని విచారణ జరిపిస్తున్నామని తెలిపారు. ల్యాండ్ టైటిలింగ్‌లో జరిగిన మోసాలపై రైతులకు వివరిస్తూ పట్టాదారు పుస్తకాల్లో తప్పులు ఏమైనా ఉంటే సరి చేసుకోవాలని తెలియజేశారు. గత ప్రభుత్వం పట్టా పట్టాదారు పుస్తకాలపై ముద్రించిన జగన్ ఫొటోలను తొలగించి భూ సర్వేలో జరిగిన తప్పులను సరిచేస్తూ రాజముద్రతో ముద్రించిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ఆర్డీఓ ఆనందరావు డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఎమ్మార్వో శ్రీధర్, కూటమి నాయకులు చిన్న వెంకటరాముడు, నారాయణస్వామి, సూర్య నారాయణ, గోవిందు, రామకృష్ణ, శ్రీరామ్‌యాదవ్, సిద్దయ్య, రమేష్, వీఆర్వోలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మునిమడుగు పంచాయతీకి వరాల జల్లు

విశాలాంధ్ర-పెనుకొండ: మునిమడుగు గ్రామపంచాయతీలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మంత్రి సవితమ్మ అర్జీలను స్వీకరించారు. అనంతరం గ్రామపంచాయతీకి వరాల జల్లు కురిపించారు. గుటురు నుంచి కొత్తచెరువుకి కొత్తగా రోడ్డు నిర్మాణం నెలలో ప్రారంభిస్తామని అలాగే ఇల్లు లేని నిరుపేద లందరికీ ఇంటి స్థలంతో పాటు ఇళ్లు మంజూరు చేస్తామని అలాగే పంచాయతీ పరిధిలోని మోటివారుపల్లి గ్రామానికి తారు రోడ్డు వేసే బాధ్యత తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే గ్రామంలో సిమెంట్ రోడ్లు కల్వర్టులు నిర్మిస్తున్నామని, పల్లె వెలుగు కార్యక్రమం ద్వారా పనులు జరుగుతున్నాయని తెలిపారు, అభివృద్ధి పనులు జరిగితే పంచాయతీలో గుంతలు లేని రోడ్లు నిర్మాణం అయినట్లు అవుతుందని తెలిపారు. గ్రామస్తులు మంత్రిని పుష్పాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ ఆనందరావు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఎమ్మార్వో శ్రీధర్, ఎక్స్ ఎంపీపీకు చిన్న వెంకటరాముడు, నారాయణస్వామి, సూర్య నారాయణ, రామకృష్ణ, పెద్దన్న, సిద్దయ్య, శ్రీరామ్ యాదవ్, గోవిందు. రమేష్. నాగభూషణ. కూటమి నాయకులు పాల్గొన్నారు.

చార్టెడ్ అకౌంటెంట్ చాలా ముఖ్యం

విశాలాంధ్ర-ధర్మవరం: సంపాదన పరిమితి దాటిన తరువాత పన్ను చెల్లించాల్సి ఉంటుంది అని,వాటి గురించిన సమగ్ర విశ్లేషకుడు చార్టెడ్ అకౌంటెంట్ అని వివేకానంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హర్ష వర్ధన్ తెలిపారు. స్థానిక రేగాటిపల్లె రోడ్డులో వివేకానంద డిగ్రీ కళాశాలలో గుంటూరు మాస్టర్‌మైండ్ కళాశాల వారిచే చార్టెడ్ అకౌంటెంట్ విశిష్టత ను కళాశాల డైరెక్టర్ బాలం లక్ష్మీనారాయణరెడ్డి, కరస్పాండెంట్ భాస్కర్ రెడ్డిల ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా నిపుణుడైన చార్టెడ్ అకౌంటెంట్‌ల కొరత తీవ్రంగా ఉన్నదని, ఆసక్తి గలవారు తమను సంప్రదిస్తే తప్పకుండా అవగాహన కల్పించి నిపుణులుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కామర్స్ విభాగాధిపతి కృష్ణయ్య, అధ్యాపకులు నరేష్,కళాశాల ఏవో రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు బాధ్యతగా మెలగాలి

విశాలాంధ్ర-ధర్మవరం: పాఠశాలలోని విద్యార్థుల పట్ల పాఠశాల హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అందరూ ఖచ్చితంగా బాధ్యతతో మెలగాలని ఎంఈఓ గోపాల్ నాయక్ తెలిపారు. శుక్రవారం మాట్లాడుతూ ఈనెల ఏడవ తేదీన ఇందిరమ్మ కాలనీలో గల మున్సిపల్ హైస్కూల్లో జరిగిన సంఘటనపై పాఠశాల ఉపాధ్యాయులతో కమిటీతో సమావేశాన్ని నిర్వహించి విచారణ చేపట్టడం జరిగిందని తెలిపారు. పాఠశాలకు గేటు రెండువైపులా ఉంటే ఒకవైపు మూసివేయాలని వారు ఆదేశించారని తెలిపారు. అదేవిధంగా నైట్ బీట్ ఏర్పాటు చేయాలని సీఐని కోరామన్నారు. ఉపాధ్యాయులతో రాతపూర్వకంగా తీసుకోవడం జరిగిందని తెలిపారు. పాఠశాల యాజమాన్య కమిటీకి తమ సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని, తల్లిదండ్రులు కూడా సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటన పునరావృతం కారాదని ప్రధానోపాధ్యాయుల్ని ఆదేశించామన్నారు. బాలికపై ఎటువంటి అఘాయిత్యం జరగలేదని విచారణలో తేలింది అన్నారు ఈ విచారణ పట్ల పాఠశాల తల్లిదండ్రులు సంతృప్తిని వ్యక్తం చేశారు.

గర్భిణీలు జాగ్రత్తలు తీసుకోవాలి

విశాలాంధ్ర-ధర్మవరం: గర్భిణీ స్త్రీలు ఆరోగ్యం పట్ల తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు తీసుకున్నప్పుడే చక్కటి ఆరోగ్యం లభిస్తుందని మెడికల్ ఆఫీసర్ డాక్టర్- ఎస్.గౌతమి, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు చిన్న తంబి చిన్నప్ప, కార్య దర్శి మంజునాథ్ తెలిపారు. శనివారం పట్టణంలోని శివానగర్లో గల అర్బన్ హెల్త్ సెంటర్లో గర్భిణీ స్త్రీలకు వైద్యులు, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కమిటీ చేతులు మీదుగా పండ్లను పంపిణీ చేశారు. నెలవారి వైద్య చికిత్సలు తప్పనిసరిగా గర్భిణీ స్త్రీలు చేయించుకోవాలని సుఖమైన ప్రసవం కోసం ప్రభుత్వ ఆసుపత్రులకే వెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వేణుగోపాల్, సహకార దర్శి రామకృష్ణ, కోశాధికారి చంద్రశేఖర్, సభ్యులు రామకృష్ణ, సాయి ప్రసాద్, నాగరాజు, నారాయణరెడ్డి, ఏఎన్ఎం పుష్పలత, నారాయణమ్మ ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోండి..

విశాలాంధ్ర-ధర్మవరం: ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో మహేష్ తెలిపారు. శుక్రవారం మాట్లాడుతూ ఈనెల 9వ, 10వ తేదీలు, 23వ, 24వ తేదీలలో ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని బిఎల్ఓ ల ద్వారా పోలింగ్ బూతులలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నూతన ఓటు, చేర్పులు మార్పులు తదితర విషయాలను పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. ఫారం-6 లో 18 సంవత్సరాలు నిండిన వారు ఓటును నమోదు చేసుకొనుట, ఫారం-7 లో తొలగింపులు, మృతి, డబుల్ ఎంట్రీ, ఇల్లు మార్పులు, వివాహమై వెళ్ళిన వారు, అదేవిధంగా ఫారం-8 చేర్పులు మార్పులను బిఎల్ ఓ ల దగ్గరకు వెళ్లి మార్పు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.

డెంగీపై అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర-ధర్మవరం: డెంగీ వ్యాధిపై పూర్తిగా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా సహాయ మలేరియా అధికారి లక్ష్మీ నాయక్ వైద్య సిబ్బందినా ఆదేశించారు. శుక్రవారం శివానగర్లో జిల్లా సహాయ మలేరియా అధికారితో పాటు సబ్ యూనిట్ మలేరియా అధికారులు పర్యటించి డెంగీపై ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలని, నీటి తొట్టెలలో నీటిని నిల్వ ఉంచరాదని తెలిపారు. రాత్రి సమయాలలో ఇంటిలో వేపాకు పొగ వేసుకోవాలని, ప్రతి శుక్రవారం ఫ్రైడే ఫ్రైడేను పాటించాలని తెలిపారు. మలేరియా సబ్ యూనిట్ అధికారులు జయరాం నాయక్, గోపీనాయక్, వెంకటేష్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చిగిచెర్లలో పొలాల పరిశీలన



విశాలాంధ్ర-ధర్మవరం: జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సహాయకులు సనావుల్లా, సహాయ వ్యవసాయ సంచాలకులు ధర్మవరం కృష్ణయ్య, మండల వ్యవసాయ అధికారితో కలిసి చిగిచెర్ల గ్రామంలో రైతుల పొలాలు పరిశీలిం చారు. గ్రామంలోని రాఘవరెడ్డి చెందిన కందిపొలం పరిశీలించి చీడ పీడలు ఉనికిని గుర్తించారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో కందిలో కాయతొలుచు పురుగు నివారణ కోసం స్పైనోసాడ్ 60ఎంఎల్ ఎకరాకు పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించామని తెలిపారు. అలాగే చిగిచర్ల ఓబిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి ఆముదం, వేరుశనగ వరి పంట పొలాలు పరిశీలించామని, అక్కడ కూడా ఆముదం పంటలో బూజు తెగులు నివారణకు ప్రోపికోనజోల్ 1ఎంఎల్ లీటరుకు పిచికారి చేయాలని చెప్పామన్నారు. వరి పంటలో దోమపోటు నివారణకు పెక్సీలాన్ 94 ఎంఎల్ ఎకరాకు పిచికారి చేయాలని సూచించామన్నారు. రబిలో సాగు చేసిన వేరుశనగ పంట మొదటి దశలో వేప నూనె ఎకరాకు లీటరు చొప్పున పిచికారి చేసుకోవాలన్నారు. తదుపరి పూత దశలో ఎకరాకు 200 కిలోలు జిప్సం వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండలవ్యవసాయాధికారి ముస్తఫా, వీహెచ్ఏ భార్గవ్, డీఆర్‌సిఏ. ఓ.అబ్దుల్ అలీ, లక్ష్మీనారాయణ ఏఈఓ గ్రామ రైతులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టి

విశాలాంధ్ర-రామగిరి : తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం మహా నేత ఎన్ఆర్ స్థాపించిన టీడీపీ బలోపేతానికి సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని మాజీ జడ్పీటీసీ రామ్మూర్తినాయుడు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు రామగిరి మండలం టీడీపీ కార్యాలయంలో శుక్ర వారం సభ్యత్వ నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వంపై ప్రతిఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించి రాష్ట్రం లోనే రాప్తాడు నియోజకవర్గం ముందుండేలా నాయకులు, కార్యకర్తలతోపాటు టీడీపీని అభిమానించే ప్రతి ఒక్కరితో సభ్యత్వం తీసుకునేలా చొరవ చూపాలన్నారు. రూ.100తో సభ్యత్వం పొందిన వారి కుటుంబంలో ప్రమాదవశాత్తు ఏదైనా అనుకోని సంఘటన జరిగితే రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తించడంతో పాటు వారి పిల్లల చదువులు, ఉద్యోగాలకు ఎన్టీఆర్ ట్రస్టు అండగా ఉంటుందన్నారు. సహజ మరణానికి రూ.10వేలు మట్టి ఖర్చులు ఇస్తారన్నారు. రూ.లక్ష చెల్లిస్తే శాశ్వత సభ్యత్వం ఉంటుందన్నారు. పార్టీలో పదవులకు, ఇతర అంశాల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య, మండల కన్వీనర్ దాసరి సుధాకర్, మాజీ ఎంపీపీ పరందామ యాదవ్, ప్రధాన కార్యదర్శి మారుతీ ప్రసాద్, తెలుగు యువత అధ్యక్షులు లింగాశ్రీధర్ నాయుడు హాజరయ్యారు.

ఉపాధి పనిలో అవినీతిని అరికట్టండి

ఎంపీడీఓకు సిపిఐ నాయకుల వినతి

విశాలాంధ్ర-తలుపుల: మండల పరిధిలోని ఉపాధి పనిలో అవినీతి కంపు కొడుతుందని వాటిని మస్టర్లు పరిశీలించి అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల సిపిఐ నాయకులు జగలు ఈశ్వరయ్య ఆవేద వ్యక్తం చేశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రామా నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి జాగిలి ఈశ్వరయ్య మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడాలేని విధంగా తలుపుల మండలంలో ఉపాధిలో అవినీతి పేరుకుపోయిందని, సంబంధించిన అధికారులు స్పందించి అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రామాలలో ఉన్న లేకున్నా ఉపాధి పనికి వెళ్లిన వెళ్లకుండానే వారి అకౌంట్లో డబ్బులు జమవుతున్నదని, దీనిబట్టి చూస్తే అవినీతి ఎంత జరుగుతుందో తెలుస్తోందన్నారు. మాస్టర్లలో పేర్లు పరిశీలిస్తే తెలిసిపోతుంది అని వారి సంతకాలు లేకున్నా సంతకాల చేసి కార్యాలయానికి అందజేస్తున్నారు. వీటన్నిటిని పరిశీలించి ఎవరైతే అక్రమంగా ఉపాధి పనిని పెడతారో వారి పైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఐ నాయకులు ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు హుస్సేన్ భాషా, రవికుమార్ నాయుడు, చంద్రారెడ్డి, సిద్ధగురుపల్లి వెంకటనారాయణ పాల్గొన్నారు.

కౌన్సిల్ మెంబర్‌గా దేరింగ్ల గంగరాజు

విశాలాంధ్ర-తలుపుల: పర్యావరణ పరిరక్షణ దక్షిణ భారతదేశం కౌన్సిల్ మెంబర్‌గా తలుపుల మండలం పల్లవాండ్లపల్లికి చెందిన దేరంగుల గంగరాజు తనను పర్యావరణ శాస్త్రవేత్త రాజయోగి డాక్టర్ భాస్కర్ నాయుడు నియమించారని శుక్రవారం తెలియజేశారు. మన ప్రాణవాయువు చెట్లనుండి వెలువడుతున్నదని, గాలి, నింగి, నేల, భూమి, ఆకాశం ప్రకృతిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతి జిల్లాను సందర్శించి చెట్లు పెంచే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తానని చెప్పారు.

రహదారి పనులకు భూమి పూజ

విశాలాంధ్ర-చిలమత్తూరు రూరల్: మండల పరిధిలోని సోమగట్ట సమీపంలో గల మధుగిరి లక్ష్మి నరసింహ స్వామి ఆలయ సమీపంలో ఎమ్మెల్యే బాలకృష్ణ ఆదేశాల మేరకు ఆయన వ్యక్తిగత కార్యదర్శి సురేంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరై శుక్రవారం రూ.20 లక్షలు వ్యయంతో రహదారి పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంచలంచెలుగా ప్రతి మండలంలో ప్రజలకు సౌకర్యంగా ఉండాలనే దృఢ సంకల్పంతో పనులు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ రంగారెడ్డి, జనసేన మండల కన్వీనర్ చిన్న ప్రవీణ్, తిప్పారెడ్డి, శ్రీదేవి, అంజినప్ప, బాలాజీ, నందీష్, బేకరీ గంగాధర్, జనసేన రమణ, ఆలయ ధర్మకర్త రామాంజనేయులు, అంజి, ఎస్.అంజి పాల్గొన్నారు.

భూ సమస్యలపై ఐదు దరఖాస్తులు

విశాలాంధ్ర-అగళి : భూ సమస్యలు పరిస్కారానికి రైతుల నుంచి 5 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ సుబ్బారావు తెలిపారు. రావూడి గ్రామ సచివాలయం ఆవరణంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ సుబ్బారావు మాట్లాడుతూ రైతులు ఎదురుక్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించడానికి ప్రతి పంచాయతీలోనూ గ్రామసభ నిర్వహిస్తామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ ఐ చంద్రశేఖర్, వీఆర్వో విలేజ్ సర్వేయర్ తదితరులు ఉన్నారు.

మార్కెట్ యార్డ్ నిర్మాణం చేపట్టాలి

విశాలాంధ్ర-శింగనమల: బుక్కరాయసముద్రం మండలం జంతలూరు సమీపంలో రైతుల సౌకర్యార్థం మార్కెట్ యార్డును నిర్మించాలని బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ కుందూ శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీకి వినతిపత్రం ఇచ్చారు, నియోజవర్గంలోని అన్ని మండలాల్లో వివిధ రకాల పండ్ల తోటలు పండిస్తున్నారని, రైతుల సౌకర్యార్థం జంతలూరులో గత ప్రభుత్వం మార్కెట్ యార్డ్ నిర్మాణానికి 10 ఎకరాల స్థలం కేటాయించిందని, దాన్ని ఇంత వరకు అమల్లోకి తేలేదన్నారు. కూటమి ప్రభుత్వం 25 ఎకరాలు కేటాయించి మార్కెట్ యార్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. సుబ్బరాయ సాగర్ ద్వారా పుట్లూరు మండలం పుట్లూరు, కోమటికుంట్ల, గరుగు చింతలపల్లి చెరువులకు నీరు నింపి ప్రజలకు తాగునీటి కష్టాలు తీర్చాలన్నారు.

ప్రజలకు ప్రమాదరహిత ప్రయాణం కల్పించాలి : ఎమ్మెల్యే కందికుంట

విశాలాంధ్ర-కదిరి: ప్రజలకు ప్రమాదరహిత ప్రయాణాన్ని కల్పించాలని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఏపీఎస్ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద కదిరి నుండి బెంగుళూరు కు 5నూతన బసులకు పూజలు నిర్వహించి స్వయంగా బస్ నడిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రయాణం సమయంలో డ్రైవర్లు, కండక్టర్లు తగు జాగ్రత్తలు పాటిస్తూ ప్రజలను వారి గమ్యస్థానాలకు చేర్చాలని కోరారు.

ప్రయాణ సమయంలో రోడ్డు భద్రత నియమాలను పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ కార్యాలయ సిబ్బంది, పలువురు కండక్టర్లు డ్రైవర్లు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించి చేనేత కార్మికులను ఆదుకుందాం

విశాలాంధ్ర-పుట్టపర్తి : ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించి ఆదుకోవాలని చేనేత కార్మికులను ఆదుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమం చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత పేర్కొన్నారు. శుక్రవారం చిత్రావతి రోడ్డులో చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో ఆప్కోషో రూమ్‌ను పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డితో కలిసి మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన జిల్లాఏర్పడినతర్వాత మొట్ట మొదటిసారి సత్యసాయి జిల్లాలో తొలి ఆప్కో షో రూమ్‌ను ప్రారంభించడం, ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా పేరుగాంచిన పుట్టపర్తిలో ఈకార్యక్రమంలో తాను పాల్గొనడం ఎంతో అదృష్టంగా ఉందని మంత్రి తెలిపారు. ముఖ్యంగా మన రాష్ట్ర చేనేత కార్మికులు తయారుచేసిన వస్త్రాలను ప్రజలకు చేరువగా తీసుకెళ్ళేందుకు ఉద్దేశంతో ఆప్కో నూతన షోరూంను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని మంత్రి తెలిపారు. గతంలో చేనేత కార్మికులు ఎన్నో ఒడిదొడుకులకు గురయ్యారని, ప్రస్తుతం తమ ప్రభుత్వం చేనేతలకు అండగా ఉంటుందన్నారు. చేనేత వస్త్రాలకు మంచి మార్కెటింగ్ సదుపాయం కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. ఆప్కో షోరూమ్ మేనేజర్లకు విక్రయ అభివృద్ధిలో మెలకువలు నేర్పించుట శిక్షణ ఇప్పించడం జరిగిం దన్నారు. గత ఆగస్టున జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా విజయవాడలో నేషనల్ హ్యాండ్లూమ్ ఎక్స్పోను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారని తెలిపారు. ఆప్కో సంస్థ ఈ సంవత్సరంలో అక్టోబర్ వరకు సుమారు రూ. 18 .36 కోర్టులో సాధారణ విక్రయాలను సాధించిందని గత సంవత్సరం కంటే రూ. 2 కోట్లు ఎక్కువగా అమ్మకాలు జరిగినట్లు తెలిపారు

బావిలో దిగి రైతు కూలీ దుర్మరణం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని కట్ట కింద పల్లి గ్రామంలో ఓ బావి వద్ద విద్యుత్ మోటార్‌ను బయటికి తీసుకునే సమయంలో రాప్తాడు నియోజకవర్గం కనగానపల్లి మండలం ముక్తాపురం గ్రామానికి చెందిన దాసరి రామాంజనేయులు(43) అనే రైతు అకస్మాత్తుగా బావిలో పడి మృతి చెందాడు. మోటారు మరమ్మత్తు కోసం బావిలో దిగి ఊపిరాడక నీటిలో మునిగి పోయి మృతి చెందాడు. మృతునితోపాటు పలువురు కూలీలు కూడా కూలి పని నిమిత్తం ధర్మారం మండలం కట్టకిందపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలోకి వెళ్లారు. బావిలో పుష్కలంగా నీళ్లు ఉండటం వల్ల బావి అడుగుభాగాన పాడైపోయిన మోటార్ను పైకి లాగే ప్రయత్నం చేశా రు. బావి అడుగుభాగంలో ఉన్న మోటారుకు తాడు కట్టేందుకు నీళ్లలో మునిగాడు. అయితే బావిలో ముళ్ళపదలు ఎక్కువగా ఉండటంతో వాటిని తగులుకొని బయటకు రాలేక ఊపిరాడిక బావిలోనే మృతి చెందాడు. ఈ విషయాన్ని తోటి కూలీలు గ్రామస్తులకు సమాచారం అందించడంతో రూరల్ ఎస్సై శ్రీనివాసులు ఫైర్స్ సిబ్బందికి సమాచారాన్ని అందించారు. వారి సహకారంతో బావిలో ఉన్న నీటిని తోడి ప్రయత్నం చేసి మృతుని కోసం గాలింపు చర్యలు చేపట్టిన రాత్రి వరకు దొరకలేదు. మృతదేహం కోసం పోలీసులు ఫైర్ ఇంజన్ సిబ్బంది కూడా ఎంత ప్రయత్నం చేసినా ఫలితం శూన్యమైంది. ఈ సమాచారాన్ని అందుకున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతతో పాటు ఆర్డిఓ మహేష్, మంత్రి సత్య కుమార్ యాదవ్ ఎన్డీఏ కార్యాలయ ఇంచార్జ్ హరీష్ బాబు, బిజెపి నాయకులు సంఘటన స్థలానికి చేరుకొని జరిగిన విషయాన్ని ఆరా తీశారు. మృతునికి భార్య తోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సంఘటన గ్రామాన్ని విషాదంలో ముంచేసింది.పరిటాల సునీత మాట్లాడుతూ మృతి చెందిన కుటుంబాన్ని ప్రభుత్వ మా అన్ని విధాలుగా ఆదుకుంటుందని తెలుపుతూ, ఆ కుటుంబానికి సంతాపం తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు.. విలాంధ్రకు స్పందన

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ప్రధాన తపాలా కార్యాలయం వెనుక భాగాన ఉన్న ట్రాన్సుఫార్మర్ బీటలు ఉండడంతో పూర్తిగా ఒరిగి పోయింది.. ఈ విషయంపై రెండు రోజుల కిందట విశాలాంధ్ర దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఈమేరకు స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు నూతన ట్రాన్సుఫార్మర్లు పడిపోకుండా తిరిగి ఒక ఎత్తైన అరుగు ఏర్పాటు చేసి, ప్రమాదాలు జరగకుండా నివారించారు. ప్రజలు విశాలాంధ్ర దినపత్రికకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఓటరు నమోదు క్లైములు స్వీకరించండి

విశాలాంధ్ర-ఓబుళదేవరచెరువు : ఓటరు జాబితా సవరణలో మార్పులు, చేర్పులపై బిఎల్ఓలు క్లైముల స్వీకరణ చేపట్టాలని తహసిల్దార్ అనంతచారి పేర్కొన్నారు. తహసిల్దార్ తన కార్యాలయంలో శుక్రవారం బీఎల్ఓలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. తహసిల్దార్ మాట్లాడుతూ... బీఎల్ఓలతో పాటు సచివాలయ సిబ్బంది పోలింగ్ బూతుల్లో ఈనెల 9, 10న అందుబాటులో ఉండాలన్నారు. బిఎల్వోలు శ్రీలత, లోకేశ్వరి, వాసుదేవ రెడ్డి, రమణ, దాదాపీర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కార దిశగా గ్రామసభ

విశాలాంధ్ర-సోమందేపల్లి: మండల కేంద్రంలోని మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం తాహసిల్దార్ రెడ్డి శేఖర్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. మండల కేంద్రాన్ని చెందిన షిరిడి నగర వాసులు మా కాలనీలో ఒక వ్యక్తి రోడ్డు ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టి రోడ్డులోనే మెటికలు నిర్మించారని, దీనివల్ల కాలనీ వసులకు రాకపోకలకు ఇబ్బందులు కలుగజేస్తున్నదని, అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని, కాలనీకి చెందిన పలువురు మహిళలు వినతిపత్రం అందించారు. మండల కేంద్రంలోని పెద్ద చెరువు పరిరక్షించాలంటూ మరికొందరు వినతిపత్రం అందించారు. తాహసిల్దార్ మాట్లాడుతూ ప్రతి పంచాయతీలోనూ తేదీలవారీగా గ్రామసభ నిర్వహిస్తామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. మండల సర్వేయర్ వినోద్ కుమార్ రెడ్డి, వీఆర్వోలు నాగరాజు, రామంజి, రెడ్డి, రామకృష్ణ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

15వ ఆర్థిక బడ్జెట్‌తో సీసీ రోడ్లు ఏర్పాటు

విశాలాంధ్ర-కదిరి: 2022-23 15వ ఆర్థిక ప్రణాళిక బడ్జెట్ ద్వారా కోటి 24 లక్షల రూపాయలతో మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో సిసి రోడ్లు ఏర్పాటుకు మున్సిపల్ కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. శుక్రవారం కౌన్సిల్ హాల్‌లో ఏర్పాటుచేసిన కౌన్సిల్ అత్యవసర సమావేశంలో మున్సిపల్ పరిధిలోని 16వ వార్డు, 34 వార్డు,6వ వార్డు, 35 వార్డులలో సిసి రోడ్లు నాణ్యతగా నిర్మించి ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేటట్లు నిర్మించాలని మున్సిపల్ చైర్ పర్సన్ నజమునిషా కమిషనర్ కిరణ్ కుమార్ తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు, వార్డు మెంబర్లు, కో ఆప్షన్ నెంబర్లు పాల్గొన్నారు.

రాళ్లపల్లిలో రెవెన్యూ గ్రామసభ

విశాలాంధ్ర-గుడిబండ : మండలంలోని రాళ్లపల్లి,శంకరగల్లు, గ్రామపంచాయతీలలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు శుక్రవారం రెవెన్యూ సమస్యలపై గ్రామ సభ నిర్వహించారు. డిప్యూటీ తహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి రైతుల నుండి 19 అర్జీలు స్వీకరించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్జీలు సమర్పించిన రైతులకు పరిష్కారం చేస్తామని తెలిపారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ బిలాల్, వీఆర్వోలు రామాంజనేయులు, సాయి సంధ్య, సర్పంచులు జయమ్మనరేంద్ర, లక్ష్మీనారాయణ, ఎంపిటిసి పుష్పలత నాగేంద్ర, మాజీ ఎంపిటిసి నజీం పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపనకు భూమిపూజ

విశాలాంధ్ర-గుడిబండ : మండల కేంద్రంలో మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎంఎల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తిల మాట్లాడుతూ రామాయణం మహాకావ్యాన్ని రచించి ప్రపంచ మానవాళికి మనుగడకు మార్గనిర్దేశం చేసిన మహానుభావుడు వాల్మీకి అని కొనియాడారు. అలాగే వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపనకు భూమి పూజ నిర్వహించారు. అనంతరం గుడిబండ గ్రామ పొలం మేర లో వెలసిన తుమ్మల మారమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యకర్తలతో ముచ్చటించారు. టీడీపీ మండలాధ్యక్షులు మద్దనకుంటప్ప, తెదేపా జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్, జిల్లా లింగాయత్ అధ్యక్షుడు దుర్గేష్, ఎంపిటిసి వనజా శశిధర్, లాయర్ శివకుమార్, క్లస్టర్ ఇంచార్జీలు లక్ష్మీనరసప్ప,భీమరాజు, మాజీ ఎంపిటిసిలు భోజరాజు, వెంకటేష్, బల్లెకట్ట ఈరన్న,మడకశిర ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ చైర్మన్ కొంకల్లు కృష్ణమూర్తి బాదిపలెప్ప పాల్గొన్నారు.

ముదిరెడ్డిపల్లిలో టీడీపీ సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర-హిందూపురం : ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆదేశాలమేరకు శుక్రవారం 35వ వార్డ్ ముదిరెడ్డిపల్లిలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి సురేంద్రబాబు, జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, తెలుగుదేశం నాయకులు పల్లా కుమార్, మారుతి, మాజీ కౌన్సిలర్ వెంకట స్వామి, ఐటీడీపి శీనా, నాగరాజు, వార్డ్ ఇంచార్జ్ చంద్రశేఖర్, వెంకటేష్, క్లస్టర్ చంద్రమోహన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ జిల్లా సదస్సు తాత్కాలిక వాయిదా..

విశాలాంధ్ర - హిందూపురం : పట్టణంలో రహమత్పురం ఆటో యూనియన్ ఆఫీస్ నందు, ఏఐటియుసి పట్టణ కమిటీ సమావేశం, పట్టణ కార్యదర్శి మారుతి రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కనిశెట్టిపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ, ఈనెల 10వ తేదీన హిందూపురంలో ఏఐటీయూసీ జిల్లా కార్మిక సదస్సు నిర్వహించనుండగా, కొన్ని అనివార్య కారణాల రీత్యా, ఈ కార్యక్రమాన్ని తత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు పట్టణ కమిటీ సమావేశంలో తీర్మానం తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జబివుల్ల, ఉపాధ్యక్షులు సమీవుల్ల, కమల్ భాష, సహాయ కార్యదర్శి నౌషద్, జమీర్, జిలాన్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, శనివారం 09, నవంబర్ 2024

భూ సమస్య పరిష్కరించిన మంత్రి

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండ లో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ క్యాంప్ కార్యాలయం నందు శుక్రవారం ఆర్డిఓ ఆనంద్ రావు తో కలిసి మరియు రెవెన్యూ అధికారులతో కలిసి భగీరథ కళ్యాణమండపం స్థలం కోసం వచ్చిన సమస్యను కుల పెద్దలతోనూ మరియు రెవెన్యూ అధికారులతోనూ సమస్యను అడిగి తెలుసుకుని ,సోమందేపల్లి పట్టణంలోని భగీరథ కళ్యాణమండపం కోసం భూమి పూజ స్థలం సమస్య ఆగిపోవడంతో కొంతమంది భూమిమీద అభ్యంతరం తెలియచేయడం ద్వారా తాత్కాలికంగా భూమి పూజ ఆగిపోయింది. అభ్యంతరం తెలియచేసిన వారితోను మరియు కలెక్టర్ మరియు ఆర్ డి ఓ ఆనందరావుతో మాట్లాడి సమస్యను పరిష్కరించిన రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవితమ్మ .సమస్యను పరిష్కరించడంతో మంత్రిగారి దగ్గరికి వచ్చి ఉప్పర కులస్తులందరూ కృతజ్ఞతలు తెలియజేశారు.భగీరతో కళ్యాణమండపం కి భవిష్యత్తులో ప్రభుత్వం పరంగా అన్ని సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేసిన మంత్రి హామీ ఇవ్వడంతో ఉప్పర కులస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ మంత్రికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు.

భూముల వెరిఫికేషన్ పూర్తి చేయాలి

విశాలాంధ్ర - అనంతపురం : ఈనెల 11వ తేదీలోపు ఫ్రీహెూల్డ్ అసైన్మెంట్ భూముల వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఫ్రీహెూల్డ్ అసైన్మెంట్ భూముల వెరిఫికేషన్ ప్రక్రియపై జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ, ఆర్డీవోలు, తహసిల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫ్రీహెూల్డ్ అసైన్మెంట్ భూముల ధృవీకరణకు సంబంధించి జిల్లాలో ఎక్కువగా పెండింగ్ ఉన్న కంబదూరు, కుందుర్పి మండలాల్లో ఈనెల 11వ తేదీలోపు వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. కంబదూరు, కుందుర్పి మండలాలను కళ్యాణదుర్గం ఆర్డీఓ ప్రత్యేక దృష్టి తీసుకొని తనిఖీ చేసి అవగాహన కల్పించి వేగవంతంగా పెండింగ్ ఉన్న భూముల ధృవీకరణను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ ఉన్న మండలాలలో ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ విషయమై ప్రత్యేక సారించాలని, ఈనెల 11వ తేదీలోపు పెండింగ్ ఉన్న మండలాల నుంచి నివేదిక అందించేలా చూడాలని డిఆర్ఓను ఆదేశించారు. ఇందులో ఏవైనా సందేహాలు ఉంటే వెంటనే నివృత్తి చేసుకోవాలని తహసిల్దార్లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డిఆర్ఓ ఏ.మలోల, కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

పంచాయతీల ఆదాయం పెంచడమే లక్ష్యం

ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపిస్తూనే పంచాయ తీల ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని అధి కారులను ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. శుక్రవారం అనంతపురం క్యాంప్ కార్యాలయంలో ఎంపీడీఓలు, ఈ.ఓ. ఆర్.డిలు, ఎన్ఆర్ఈజీఎస్, పి.ఆర్. ఇంజనీర్లతో సమావేశం నిర్వహించారు. ప్రధానం గా ప్రజలకు తక్షణ అవసరం ఏంటన్నది గుర్తించి ఆ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. గత ప్రభుత్వంలో పంచాయతీలలో కనీస మౌలిక వసతులపై నిర్లక్ష్యం వహించడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కూటమి ప్రభుత్వంలో తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ, వీధిదీపాలు నిర్వహణ సరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పన్నులు చెల్లించేలా చొరవ తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో రూ.25కోట్ల ఉపాధి నిధులతో ప్రారంభించిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పనులు నాణ్యత లేకపోతే.. బిల్లులు రావన్న విషయాన్ని స్పష్టంగా తెలియ జేయాలన్నారు. ఉపాధి పథకంలో అక్రమాలు చోటు చేసుకోకుండా అధికారులు గట్టి చర్యలు చేపట్టాలన్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల మెరుపు దాడి

52 వేల,200 వందల రూపాయలు స్వాధీనం

విశాలాంధ్ర గుడిబండ : మండల పరిధిలోని ఆచారిపాళ్యం గ్రామం కర్ణాటక రాష్ట్రం సరిహద్దులో ఉండడంతో మండలానికి చెందిన కొందరు అలాగే కర్ణాటక ప్రాంతానికి చెందిన కొందరు పేకాట స్థావరాలు ఏర్పరచుకొని గ్లాంబింగ్ నిర్వహిస్తున్నట్లు పక్కా సమాచారంతో మడకశిర సిఐ రాజకుమార్, గుడిబండ ఎఎస్ఐ చంద్రశేఖర్,వారి సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై మెరుపు దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రాజకుమార్ మాట్లాడుతూ గుడిబండ పోలీసులతో కలిసి చేసిన మెరుపు దాడిలో గుడిబండ,రొళ్ళ మండలాలు,అలాగే కర్నాటక రాష్ట్రానికి చెందిన ఆరు మందిని అదుపులోకి తీసుకున్నామని, ఐదు మంది పరారీలో ఉన్నారని వారి కోసం గాలిస్తున్నామని, వారి వద్ద నుండి 52 వేల 2 వందలరూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు,తెలిపారు. ఈ దాడుల్లో కానిస్టేబుల్ నరేష్, పాతన్న,మంజునాథ్, సుధాకర్, శ్రీనివాస్, హెూంగార్డ్ ప్రశాంత్ తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి ..

విశాలాంధ్ర-బొమ్మనహాల్ : ఆంధ్ర కర్ణాటక సరిహద్దు బొమ్మనహాల్ సమీపన హెచ్ఎల్సీ కాలువ దగ్గర పొలాల్లో కొందరు పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో శుక్రవారం దాడి చేసి 13 మంది వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ. 87040 నగదు 52 పేక ముక్కలు స్వాధీనం పరచుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నబి రసూల్ తెలిపారు. ఈ కేసులో ఎత్తిన బుదేహాల్ గ్రామం కర్ణాటకకు చెందిన బోయ రవి అనే ఆర్గనైజర్ను బొమ్మనహాల్కి చెందిన పేకాట రాయళ్ళను పట్టుకున్నారు. మండలంలో ఎవరైనా పేకాట ఆడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

ప్రీ రిపబ్లిక్ పేరేడే క్యాంపుకు ఎంపికైన జేఎన్టీయూ విద్యార్థులు

విశాలాంధ్ర - జేఎన్టీయూ ఏ : జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో శుక్రవారం డిల్లీ ప్రీ రిపబ్లిక్ పేరేడే క్యాంపుకు ఎంపికైన ఎస్.వెంకటేష్ నాయక్, జి.నందితను ఇన్చార్జి వీసీ ఆచార్య సుదర్శన్ రావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్ కృష్ణయ్య అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రీ రిపబ్లిక్ శిక్షణ పొంది రిపబ్లిక్డేలో పాల్గొని విశ్వవిద్యాలయ కీర్తిని ఇనుమడింపజేసి విజయ శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నా రు. ఎంపికైన ఇద్దరు జేఎన్టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల లో ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు, జి. నందిత అనుబంధ కళాశాల అయిన ఓటిపిఆర్ఐ లో ఎమ్మెస్సీ ఫుడ్ టెక్నాలజీ చదువుతున్న విద్యార్థులు ఎంపికయ్యారు. 10 రోజుల పాటు కవియిత్రి బహినా బాయి చౌదరి నార్త్ మహారాష్ట్ర యూనివర్సిటీ జల్గాన్ క్యాంపులో ఈనెల 21 వరకు శిక్షణ తీసుకొనన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ శారద , ఎంపికైన విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయం

విశాలాంధ్ర - నార్పల : తాను పుట్టిన గ్రామం పై గ్రామ ప్రజలపై ఉన్న మమకారాన్ని ప్రేమను చాటుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు తమ వంతు కృషిగా చేస్తా అని మండల పరిధిలోని సిద్ధరాచర్ల గ్రామంలో రచ్చ కట్ట నందు సర్పంచ్ రామాంజనేయులు ఆధ్వర్యంలో హర్షిత ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే కాంక్ష చాలా గొప్పదని సర్పంచ్ సాకే రామాంజనేయులు అన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంనందు డాక్టర్ జి.రాము ఎంబిబిఎస్ నేతృత్వంలో వివిధ వ్యాధులు సంబంధించి ఈ క్యాంప్ నందు చూడటం జరిగింది.అదేవిధంగా ఉచితంగా మందులు మాత్రలను షుగర్ పరీక్షలను ఉచితంగా చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో డాక్టర్ రామచంద్ర, ఫార్మసిస్ట్ రాజశేఖర్, మేనేజర్ హరి, జి ఆర్ బి ఎస్ మారుతి, మరియు సిబ్బంది గ్రామస్తులు నాగిరెడ్డి, తిరుపాలు, రాజు, చంద్రశేఖర్ రెడ్డి, తిరుపాలమ్మ తదితరులు గ్రామస్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గర్భిణీలకు పౌష్టికాహారం పంపిణీ

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని కొత్త కూరగాయల మార్కెట్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో శుక్రవారం లయన్స్ క్లబ్, మహిళా లయన్స్ క్లబ్స్ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం పంపిణీ చేసినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు టి.సంజీవ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరవింద నారాయణ రెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో 50 మంది గర్భిణీ స్త్రీలకు సిరప్పులు మందులు, పౌష్టికాహారం పంపిణీ చేశా మన్నారు. అన్నదానం కూడా చేశారు. లయన్స్ క్లబ్ సెక్రటరీ యం.రాజా నాయుడు, సి.రమేశ్నాథరెడ్డి, ఎన్.వి.భాస్కర్రెడ్డి పాల్గొన్నారు.

నారాయణ సేవలో అన్నదానం

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి వివిధ గ్రామాల నుండి వైద్య పరీక్షల కొరకు వచ్చినటువంటి గర్భిణీ స్త్రీలకు వారి సహాయకులకు , అనారోగ్యంతో వచ్చిన వారికి మరియు ఆరోగ్య కార్యకర్తలకు నారాయణ సేవలో భాగంగా 120 మందికి అన్నదానం అరటి పండ్లువాటర్ పాకెట్లను, అంద చేసినారు ఈ కార్యక్రమానికి కల్పన , రమేష్ వీరి కూతురు జాహ్నవి రాయల్ జన్మదిన సందర్భంగా సహకరించి, సేవలో పాల్గొన్నారు. చిరంజీవి జాహ్నవి రాయల్ కి జన్మదిన శుభాకాంక్షలు, తెలియజేస్తూ వీరి కుటుంబ సభ్యులకు మరియు సేవలో పాల్గొన్న వారందరికీ భగవాన్ బాబా వారి యొక్క అనుగ్రహ ఆశీస్సులు కలిగి ఉండాలని కోరుకుంటున్నా మనీ. సత్యసాయి తాలూకా సేవా సమితి అధ్యక్షులు శంకర్ తెలిపారు.

సమస్యల పరిష్కారం దిశగా రెవెన్యూ గ్రామసభ

విశాలాంధ్ర-రొళ్ల: మండలంలోని ఎం.రాయపురం గ్రామ పంచాయతీలలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు శుక్రవారం సమస్యల పరిష్కారం దిశగా రెవెన్యూ గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు ఇన్చార్జ్ తహసిల్దార్ షేక్షావలి తెలిపారు. రైతుల నుండి మొత్తం 27 అర్జీలు స్వీకరించినట్లు వారు తెలిపారు.త్వరలోనే ఆయా శాఖలకు సంబంధించిన అర్జీలు క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతుల సమస్యలకు పరిష్కారం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ గిరియప్ప,ఈ.ఓ.ఆర్.డి బాబు రావు,వీఆర్వోలు నాగరాజు పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్,తెదేపా మండల అధ్యక్షుడు దాసిరెడ్డి, టి.ఎన్.టి.యు.సి రాష్ట్ర కార్యదర్శి బి.యస్ గురుమూర్తి మాజీ వైస్ ఎంపీపీ సిద్ధగంగప్ప,తెదేపా నాయకులు ఉగ్రేగౌడు పాల్గొన్నారు.

రెవిన్యూ సదస్సులు ద్వారానే సమస్యల పరిష్కారం

విశాలాంధ్ర-చిలమత్తూరు రూరల్: మండల పరిధిలోని పలగలపల్లి పంచాయతీలో శుక్రవారం తహసిల్దార్ యునెస్ బాబు ఆధ్వర్యంలో రెవిన్యూ సదస్సులు నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర బాబు హాజరైనారు, ఈ సందర్భంగా పంచాయతీలో 37 వినుతలు అందినట్లు తహసిల్దార్ తెలిపారు, రెవిన్యూ పరంగా వచ్చిన 9 వినతులను అక్కడికక్కడే పరిష్కారం చేశారు, మిగిలిన వాటిని త్వరలో పరిష్కారం అయ్యేలా చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు, అనంతరం ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ పరంగా ఎటువంటి సమస్య వచ్చిన వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధుల ద్వారా పరిష్కారం చేసుకోవాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రంగారెడ్డి, జనసేన మండల్ కన్వీనర్ చిన్న ప్రవీణ్, రమణ, అగ్గి శ్రీనివాసులు, టిడిపి నాయకులు తిప్పారెడ్డి, శ్రీదేవి, వైస్ ఎంపీపీ బయ్యప్ప, బాలాజీ, నందీష్, సురేంద్ర, సర్వేయర్ కోదండపాణి, గ్రామ ప్రజలు, పోలీస్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గృహప్రవేశహానికి హాజరైన మెట్టు గోవింద్ రెడ్డి

విశాలాంధ్ర-డి.హీరేహాళ్ : మండలంలోని వైసీపీ నాయకుడు మూలమనే ఏరీ స్వామి నూతన గృహప్ర వేశానికి రాయదుర్గం వైసీపీ సమన్వయకర్త మెట్టు గోవింద్ రెడ్డి శుక్రవారం గృహప్రవేశానికి హాజరయ్యారు. గృహ యజమాని మెట్టు గోవింద్ రెడ్డికి శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు రాంతుల్లా, తొండ వెంకటేష్, మురళీమోహన్, శివారెడ్డి, హనుమంత రెడ్డి, రామకృష్ణ, నల్లబండ్ల వంద్రప్ప,గౌసిద్ద తదితర నాయకులు,పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యం

విశాలాంధ్ర-తలుపుల: మండలం స్థానిక ఏటి గంగమ్మ దగ్గర గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం అతని మొహం మొత్తం కనిపించడం లేదు. మృతుని కుడి చేతి పైన అంజి అని తెలుగులోనూ, ఉమా అను అక్షరాలు ఆంగ్లంలోనూ ఉన్నవి, తలుపుల పోలీస్ స్టేషన్ నందు కేసు రిజిస్టర్ చేసి దర్యాప్తు ప్రారంభించడమైనది. మృతుని యొక్క వివరాలు ఎవరికైనా తెలిసిన యెడల వెంటనే తలుపుల ఎస్సై గారి ఫోన్ నెంబర్ 9490113581కి గాని, కదిరి రూరల్ సర్కిల్ సిఐ గారి 9440796853 కి గాని వెంటనే సమాచారం అందించగలరు.

ఎమ్మెల్యే బాలయ్య ఫోటోను మరిచిన అధికారులు

విశాలాంధ్ర-చిలమత్తూర్ రూరల్: మండల పరిధిలోని పలగలపల్లి పంచాయతీ గ్రామంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పి జి ఆర్ ఎస్) గ్రామసభ కార్యక్రమం నిర్వహించారు. అయితే హిందూపురం నియోజకవర్గం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆ గ్రామసభ కార్యక్రమం ఫ్లెక్సీలో బాలయ్య ఫోటో అధికారులు పెట్టక పోవడంతో, ఆయన వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర బాబు ఆ కార్యక్రమానికి హాజరై ప్రజా సమస్యలపై వినతలు తెలుసుకొంటూ ఫ్లెక్సీ(బ్యానర్) వైపు చూసి బాలయ్య ఫోటో లేకపోవడంతో అధికారులను మందలించారు, రాబోయే కార్యక్రమానికి తప్పకుండా ఎమ్మెల్యే ఫోటో ఉండాలని హెచ్చరించారు.

రైతుల కోసం గ్రామ రెవిన్యూ సదస్సు

విశాలాంధ్ర-అమరాపురం: మండలంలోని వలస గ్రామపంచాయతీ సచివాలయ కేంద్రం వద్ద రెవెన్యూ సదస్సును రైతుల సమస్యలు పరిష్కారానికి ఏర్పాటు చేసినట్లు తమరాపురం తహసిల్దార్ మారుతి ప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని వలస గ్రామ సచివాలయం వద్ద రెవెన్యూ గ్రామ పరిధిలోని వలస, వి.అగ్రహారం గ్రామాలకు సంబంధించి గ్రామ రెవెన్యూ సదస్సును శుక్రవారం మండల ప్రత్యేక అధికారి మూర్తి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలను రెవిన్యూ సదస్సులో అర్జీలు సమర్పిస్తే సమస్యలను పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా వలస నుండి నడలుడం, మరియు విరపసముద్రం, గ్రామాలకు వెళ్లే రోడ్లకి ఇరువైపులా కంప చెట్లు పెరిగాయని వీటిని తొలగించడానికి కృషి చేయాలని టిడిపి నాయకులు అధికారులను కోరారు. స్థానిక రోడ్డు ఇరువైపుల కంపచెట్ల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు.అనంతరం తహసిల్దార్ మాట్లాడుతూ మీ సమస్యలను సంబంధిత అధికారులకు తెలియజేసి పరిష్కారం కృషి చేస్తామన్నారు.అదేవిధంగా రైతులు సదస్సులో పాల్గొని తమ సమస్యలపై అర్జీలను అధికారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులతో పాటు టిడిపి నాయకులు తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ గణేష్ మాజీ మండల కన్వీనర్ శివ రుద్రప్ప వలస సర్పంచ్ జితేంద్ర చంద్రశేఖర్ గౌడ్ నిరంజన్ నాగరాజు రైతులు పాల్గొన్నారు.

సత్యనారాయణుడికి ప్రత్యేక పూజలు..

విశాలాంధ్ర - ఆగళి : మండలంలోని జంగమరహళ్లి గ్రామం లో టిడిపి నాయకులు నూతనంగా నిర్మించిన నూతనగృహప్రవేశ వేడుకల్లో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మడకశిర తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. ఈసందర్భంగా సత్యనారాయణ స్వామి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఉమేష్ , సర్పంచ్ నరసింహమూర్తి జిల్లా వాల్మీకి సంఘం ఉపాధ్యక్షులు కోడిపల్లి రమేష్ మాజీ సింగల్ విండో అధ్యక్షులు శ్రీనివాస్ టిడిపి నాయకులు సౌకత్ ఆలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత డీఎస్సీ శిక్షణ పరీక్ష వాయిదా

విశాలాంధ్ర-తాడిపత్రి : ఉచిత డీఎస్సీ శిక్షణ పరీక్ష వాయిదా వేసినట్లు శుక్రవారం ఎస్సీ వెల్ఫేర్ అధికారి రాధిక పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవంబర్ పదవ తేదీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖల ద్వారా నిరుపేద ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత వసతి, ఉచిత భోజనాది సదుపాయాలతో డీఎస్సీ శిక్షణను పేరు ప్రఖ్యాతలు గడించిన ప్రైవేటు శిక్షణ సంస్థలను గుర్తించి వాటి ద్వారా శిక్షణ ఇప్పించుటకు నిర్ణయం తీసుకుంటూ స్క్రీనింగ్ టెస్ట్ ఈనెల అనగా నవంబర్ 10 2024 ఆదివారం నాడు నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు చేస్తూ పత్రికా ముఖంగా తెలియజేయడమైనది.కానీ ఇందు మూలంగా అభ్యర్థులకు తెలియజేయడ మేమనగా, గౌరవ సంధాలకులు, సాంఘిక సంక్షేమ శాఖ ఆంధ్రప్రదేశ్, అమరావతి వారు తమ ఉత్తర్వులలో తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా గుంటూరు జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన మోడల్ ప్రవర్తన నియమావళి ప్రభావం కారణంగా 10.11.2024న జరగాల్సిన మెగా డీఎస్సీ స్క్రీనింగ్ పరీక్ష వాయిదా పడిందని తెలుపుతూ తదుపరి తేది తెలియచేయడం జరుగుతుందని తెలిపారు. కావున తదుపరి నిర్వహణ తేదీని త్వరలోనే మీకు తెలియజేస్తామని చెప్పారు.

పేకాట రాయుళ్లు అరెస్ట్

విశాలాంధ్ర-తాడిపత్రి: పేకాట రాయలను అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ శివ గంగాధర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వెంకటరెడ్డి పల్లి గ్రామం వద్ద శుక్రవారం రమేష్ రెడ్డి విల్లాస్ వద్ద పేకాట ఆడుతున్నారని సమాచారంతో సిబ్బందితో కలసి రైడ్ చేసి 5 మంది వ్యక్తులను, 3 ద్విచక్రవాహనాలను, 15,740/- రూపాయలు స్వాధీనం చేసుకొని రిమాండ్ కు పంపడమైనదని చెప్పారు.

అపార్ అప్డేషన్ వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి

విశాలాంధ్ర-అనంతపురం : అపార్ అప్డేషన్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ క్షేత్రస్థాయిలో పర్యటన చేశారు. శుక్రవారం అనంతపురం నగరంలోని శ్రీకృష్ణదేవరాయ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో అపార్ అప్డేషన్ ఎలా జరుగుతోందో తనిఖీ చేశారు. అనంతరం నగరంలోని 26వ డివిజన్లో ఉన్న హమాలీ కాలనీలో 44వ వార్డు సచివాలయాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేసి సచివాలయ సిబ్బందితో అపార్ అప్డేషన్ లో ఏవైనా సమస్యలు ఉన్నాయా అంటూ అడిగి తెలుసుకున్నారు. తదనంతరం అనంతపురం రూరల్ పరిధిలోని మండల వనరుల కేంద్రాన్ని తనిఖీ చేసి అపార్ జనరేషన్ లో చేపట్టాల్సిన చర్యల గురించి ఆరా తీశారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అపార్ అప్డేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. సచివాలయాన్ని తనిఖీ చేసి, అపార్ జనరేషన్ లో ఏం సమస్యలు వస్తున్నాయి అనేది అడిగి తెలుసుకుని, ప్రక్రియను వేగంగా చేయాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్డీవో కేశవ నాయుడు, డీఈవో ప్రసాద్ బాబు, నగరపాలక సంస్థ కమిషనర్ నాగరాజు, అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వరరావు, తహసిల్దార్ హరికుమార్, ఏపీఎం నాగరాజు, ఎంఈఓలు వెంకటస్వామి, సరితారాణి, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా తెదేపా సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర-రొళ్ల : మండలంలోని దొమ్మరహట్టి గ్రామంలో శుక్రవారం తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని యూనిట్ ఇంచార్జ్ వెంకటేష్ ఆధ్వర్యంలో అట్టహాసంగా చేపట్టారు. మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మడకశిర ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మరియు తెదేపా మండల అధ్యక్షుడు దాసిరెడ్డి ఆదేశాల మేరకు తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడుతూ కార్యకర్తల కోసమే టీడిపి సభ్యత్వ నమోదు చేస్తున్నామని ప్రతి ఒక్కరూ వంద రూపాయలతో సభ్యత్వం తీసుకుంటే ఐదు లక్షల ప్రమాద బీమా పిల్లల చదువు ఆర్థిక సహాయం ఉపాధి అవకాశం కల్పిస్తుందన్నారు.సహజ మరణం సంభవిస్తే తక్షణ సాయం మట్టి ఖర్చుల కోసం పదివేల రూపాయలు పార్టీ తరఫున అందజేస్తామని తెలిపారు. కార్యకర్తలు హరీష్ చౌడప్ప తదితరులు పాల్గొన్నారు.